



అనంతపురంలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు





రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువుదీరింది. టిడిపి ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టింది. ప్రభుత్వం మారడంతో ప్రభుత్వ శాఖల ప్రక్షాళన దిశగా అడుగులు పడుతున్నాయి. జిల్లా నుంచి మండల స్థాయి వరకు దాదాపు అన్ని శాఖల్లో అధికారులకు స్థానచలనం తప్పదనే చర్చ ఉద్యోగ వర్గాల్లో నడుస్తోంది. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్ తదితర ముఖ్య శాఖల్లో అధికారుల మార్పు జరుగుతుందనే ప్రచారం నడుస్తోంది. ఈ సమయంలో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులకు బదిలీల ఫీవర్ పట్టుకుంది. ఉద్యోగులు ఏదో ఒక విధంగా తమకు అనుకూలమైన చోట పోస్టింగ్ తెచ్చుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకుని నచ్చిన స్థానంలో ఉద్యోగం పొందేలా పావులు కదపుతున్నారు.

అధికారులకు

స్థానచలనం తప్పదా..?

- ◆ 'అధికార' మార్పుతో చాలా శాఖల్లో మార్పులు
- ◆ జిల్లాకు వచ్చేందుకు పాతవారి ప్రయత్నం
- ◆ మొదలైన పైరవీల పర్వం
- ◆ ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే యత్నాలు

ప్రజాశక్తి - అనంతపురం

జిల్లాలోని పలు శాఖల్లో అధికారులకు బదిలీల ఫీవర్ పట్టుకుంది. నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఆయా శాఖల్లో వారికి అనుకూలమైన వారిని తెచ్చిపెట్టుకునేందుకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పావులు కదుపుతున్నారు. జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలతో పాటు 14 అసెంబ్లీ స్థానాల్లో కూటమి విజయం సాధించింది. మంత్రి వర్గ విస్తరణ కూడా పూర్తయ్యింది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి మూడు మంత్రి పదవులు దక్కాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తెసుకెళ్లాలంటే తమకు అనుకూలంగా ఉండే అధికారులు ఆయా స్థానాల్లో ఉంటే మేలను ప్రజాప్రతినిధులు ఆలోచిస్తున్నారు. దీనికి తోడు గతంలో పని చేసిన కొందరు అధికారులు వైసిపికి మద్దతుగా ఉన్నారనే భావన చాలా ప్రస్తుతం టిడిపి నుంచి గెలిచిన ఎమ్మెల్యేల్లో ఉంది. ఇప్పటి నుంచే తమకు అనుకూలంగా ఉన్న వారిని నియమించుకుంటే పాలనలో పట్టు సాధించవచ్చనే భావనలో ఎమ్మెల్యేలు ఉన్నారు. ఎన్నికల సమయంలో అంతర్గతంగా సలహాలు ఇచ్చిన వారికి, సామాజిక వర్గం పరంగా తమకు అనుకూలంగా ఉన్న వారిని వారి నియోజకవర్గంలోకి తెచ్చుకునే ప్రయత్నాల్లో ఉన్నారు.

ప్రభుత్వం మారిన తర్వాత ఎమ్మెల్యేల బదిలీలపై దృష్టి సారిస్తుండడంతో అధికారులు, ఉద్యోగులకు బదిలీల జ్వరం పట్టుకుంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం పలు కీలక ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కొందరు అధికారులు, సిబ్బందిని మార్చాలని రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన టిడిపి ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ దిఆశలోనే ఐఎఎస్, ఐపిఎస్ ముఖ్య అధికారులకు స్థానం చలనం చేసే దిశగా ప్రభుత్వం పెద్దలు చర్యలకు ఉపక్రమించారు. ఆయా నియోజక వర్గాల్లో స్థానికంగా నచ్చనివారిని పంపించి తమకు అనుకూలంగా ఉన్న వారిని తెచ్చుకునే ప్రయత్నంలో నేతలు పావులు కదుపుతున్నారు. ప్రధానంగా రెవెన్యూ, పోలీసు, మున్సిపాల్టీ శాఖల్లో అధికారుల మార్పు తప్పని సరిగా కన్పిస్తోంది. పోలీసు, రెవెన్యూ శాఖల్లో పూర్తిగా మార్చి తమకు అనుకూలంగా ఉన్న వారిని తెప్పించుకునేలా ఆయా ఎమ్మెల్యేలు జాబితాలు సిద్ధం చేసుకున్నారు. ఇదే సమయంలో అధికారులు కూడా వారికి నచ్చిన ప్రాంతంలో పోస్టింగ్‌లు తెచ్చుకోవడం కోసం పైరవీలు ప్రారంభించారు. తమకు తెలిసిన ముఖ్య నేతలతో బదిలీలకు సిఫార్సులు చేయించు కుంటున్నారు. కొందరు అధికారులు మాత్రం తమ స్థానాలను కాపాడుకునేందుకు ప్రజాప్రతినిధులతో రాయబారాలు చేస్తున్నారు. మరో నెల రోజుల్లో అన్ని శాఖల్లోనూ దాదాపు ఇప్పుడున్న అధికారుల స్థానంలో కొత్త వారు వచ్చే అవకాశాలు మాత్రం స్పష్టంగా కన్పిస్తున్నాయి.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

- ◆ ఈద్గాల్లో ముస్లిముల ప్రత్యేక ప్రార్థనలు
- ◆ పలువురి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి అనంతపురం వ్యాప్తంగా బక్రీద్ వేడుకలను ముస్లిములు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం ఉదయాన్నే కొత్త దుస్తులు ధరించి ఈద్గా మైదానాలకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. సర్వమానవాళి శాంతి, సుఖ సంతోషాలతో మెలగాలని కోరుకున్నారు. ప్రార్థనల అనంతరం ఖుర్బానీ ఇచ్చి మాంసాన్ని పంపిణీ చేశారు. అనంతపురం నగరంతో పాటు గుత్తి, తాడిపత్రి, గుంతకల్లు, సత్యసాయి జిల్లాలో హిందూపురం, పెనుకొండ, కదిరి, ధర్మవరం పట్టణాల్లోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు ముస్లిములకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. సోదరభావంతో పండుగలను అందరూ కలసిమెలసి చేసుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీ అంబికా లక్ష్మినారాయణ ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, కందికుంట వెంకటేశ్వరప్రసాద్, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తదితరులు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు జిల్లాకు కరువుబృందం

19న రబీ -2023-24 కరువును పరిశీలించనున్న ఐఎంసిటి టీం

ప్రజాశక్తి- అనంతపురం

2023-24 రబీ సీజన్‌లో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు కరువు అధ్యయన బృందం(ఐఎంటిసి) బృందం మంగళవారం నాడు అనంతపురం జిల్లాకు చేరుకోనున్నారు. 19వ తేదీ ఉదయం రాష్ట్ర స్థాయి రబీ 2023-24 కరువుపై సమీక్షా సమావేశాన్ని అనంతపురం రెవెన్యూ భవన్‌లో నిర్వహించనున్నారు. ఇందులో ఒక బృందం సత్యసాయి జిల్లాకు వెళ్తుంది. రెండవ బృందం కర్నూల్ జిల్లా పర్యటనకు వెళ్లుంది. 20న ఒక బృదం అనంతపురం జిల్లాలోని ఉరవకొండ నియోజకవర్గంలో పప్పుశనగ సాగుచేసిన మండలాలు వజ్రకరూరు, విడపనకల్, ఉరవకొండ, కనేకల్ మండలంలో పర్యటిస్తుంది. ఉమ్మడి జిల్లా పర్యటన అనంతరం 20వ తేదీ సాయంత్రం విజయవాడకు బృందం వెళ్తుంది. కరువు బృదంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాకు సంబంధించి మొదటి బృందంలో రితేష్ చౌహాన్, డా॥ కె.పొన్నుసామి, డి.సునీల్ దూబే, 2వ బృందంలో చిన్మయ్ గోత్మరే, ఆశిష్ పాండే అరవింద్ కుమార్ సోని, 3వ బృందలో మన్ను జీ ఉపాధ్యాయ్, కశ్యప్, మదన్ మోహన్ మౌర్య, అనురాధ బటానాలు ఉన్నారు. కరువు బృందం పర్యటన నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

పొలాల్లో నీటి సంరక్షణ నిర్మాణం తప్పనిసరి

◆ వ్యవసాయ రంగానికి ఎఫ్ ఎకాలజీ సేవలు అభినందనీయం ◆ కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వ్యవసాయానికి వాననీటిపై మాత్రమే ఆధారపడకుండా, సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ రైతులకు సూచించారు. సోమవారం ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో పంగల్ రోడ్ ఆర్‌డిటి వికలాంగుల పాఠశాల సమావేశ మందిరంలో ప్రపంచ కరువు, ఎడారీకరణ నివారణ దినోత్సవాన్ని పురష్కరించుకుని సెమినార్ నిర్వహించారు. ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌కు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూములను బీడుగా ఉంచకుండా, ఎడారీకరణ సంకేతాలను తిప్పికొట్టేందుకు కనీసం పశుగ్రాసం కోసం అయినా ఏదైనా పండించాలని రైతులకు సూచించారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి సేవలందిస్తున్న ప్రభుత్వేతర సంస్థలకు అన్ని సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జిల్లాలో దశాబ్దాలుగా తక్కువగా లేదా విపరీతంగా వర్షాలు కురుస్తు కరువు ఏర్పడుతోందన్నారు. వ్యవసాయ చెరువు, మరేదైనా నీటి సంరక్షణ నిర్మాణం ఆవశ్యకతపై రైతు సమాజంలో అవగాహన కల్పించేందుకు ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ చేస్తున్న చర్యలు అభినందనీయం అన్నారు. వాటర్‌షెడ్ ప్రాజెక్టులు, ఫారం పాండ్‌లు, గట్లపై సీడ్ డ్రిబ్లింగ్‌లో అనంతపురం జిల్లా ముందంజలో ఉందన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతూ వారి పొలాల సరిహద్దుల్లో మొక్కలుగా నాటేందుకు 100 మొక్కలు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. టేకు, మహోగని, గంధపుచెట్టు, ఎర్రచందనం, చింతపండు మొక్కలు అటవీ శాఖ నర్సరీలలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతులు తమకు నచ్చిన వాటిని ఎవరైనా తీసుకోవచ్చన్నారు. ఎఎఫ్ ఎకాలజి సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి మాట్లాడుతూ ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ అనంతపురం జిల్లాలోని ఎనిమిది మండలాల్లో 40 సంవత్సరాలుగా నీటి సంరక్షణ ప్రాజెక్టులపై పని చేస్తోందన్నారు. కొన్ని వాతావరణానికి తట్టుకునే పంటలను, ప్రదర్శన ప్లాట్లను ఉపయోగించి విత్తే నమూనాలను అభివద్ధి అనంతపురంలో 2023లో ఎన్నడూ లేని విధంగా జలకళ కరువు ఏర్పడిందన్నారు. ఈ ఏడాది జూన్‌లో 140 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని, 515 మిల్లీమీటర్ల (విభజిత అనంతపురం జిల్లా) వర్షపాతం నమోదైందన్నారు. ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ రైతులకు 5 వేల మందికి సహాయం చేశాయని తెలిపారు. వ్యవసాయ చెరువులు, ఇతర నీటి సంరక్షణ నిర్మాణాల ద్వారా రక్షిత నీటిపారుదలని అందించడంలో ఉపయోగపడతాయన్నారు. రైతులు తమ భూమిలో కనీసం ఒక ఫారం పాండ్, మరేదైనా నిర్మాణంతో నీటిని సంరక్షించాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ కోరారు. త్వరలోనే వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నిర్మాణాలను పరిశీలిస్తారని ఆమె తెలిపారు. బెంగుళూరుకు చెందిన సేట్రీస్ ఎన్జీవో ప్రతినిధి మహీధర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో చెట్ల పెంపకాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని, ఎడారీకరణను ఆపడానికి వ్యవసాయ శాస్త్ర ప్లాట్‌లను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఆర్‌డిటి ఇన్‌క్లూజివ్ స్కూల్ గ్రౌండ్‌లో నీటి సంరక్షణ పద్ధతులు, పంటల పద్ధతులు, సహజ వ్యవసాయ పద్ధతులు, విభిన్న యాంత్రిక సమర్ధవంతమైన వ్యవసాయ పనిముట్లతో కూడిన ప్రదర్శనను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి రత్నకుమార్, ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.రఘునాథరెడ్డి, నీటి సంరక్షణ నిర్మాణాల్లో పనిచేస్తున్న పలు ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సెమినార్‌లో కలెక్టర్ వి.వినోద్‌కుమార్



నీటికుంటను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్, తదితరులు

కేశవ్‌కు 'అనంత' స్వాగతం



పయ్యావులకు స్వాగతం పలుకుతున్న టిడిపి శ్రేణులు (ఇన్‌సెట్‌లోఅభివాదం చేస్తున్న కేశవ్)

- ◆ తొలిసారి జిల్లాకు వచ్చిన నేతకు గ్రాండ్‌వెల్‌కమ్
- ◆ గుత్తి నుంచి ఉరవకొండ వరకు రోడ్‌షో
- ◆ మంత్రిని అయినా జిల్లాకు కూలీనే : పయ్యావుల

ప్రజాశక్తి-అనంతపురం, గుత్తి, పామిడి,

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా జిల్లా ఇచ్చేసిన పయ్యావుల కేశవ్‌కు అభిమాన స్వాగతం లభించింది. సోమవారం ఉదయం ఆయన రోడ్డు మార్గాన విజయవాడ నుంచి గుత్తికి చేరుకున్నారు. జిల్లా సరిహద్దులోని గుత్తి బాట సుంకలమ్మ ఆలయం వద్ద ఆయనకు టిడిపి శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, జెసి.అస్మిత్ రెడ్డి, గుమ్మనూరు జయరాం, ఎంఎస్.రాజు, అనంతపురం టీడీపీ జిల్లా అధ్యక్షుడు జి.వెంకట శివుడు యాదవ్‌తో పాటు టిడిపి నాయకులు పుష్పగుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి సుంకులమ్మ గుడిలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గుత్తి పట్టణానికి చేరుకుని మహాత్మా గాంధీ, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అక్కడి నుంచి రోడ్‌షోగా గుత్తి, పామిడి, గార్లదిన్నె, అనంతపురం, కూడేరు మీదుగా ఉవకొండకు చేరుకున్నారు. అడుగడుగునా కేశవ్‌కు టిడిపి అభిమానులు ఘన స్వాగతం లభించారు. క్రేన్ల సాయంతో గజమాలతో ఆయన్ను సత్కరించారు. అభిమానులకు విక్టరీ సంకేతం చూపుతూ మంత్రి రోడ్‌షోను కొనసాగించారు. పలుప్రాంతాలో ఆయన టిడిపి శ్రేణులకు ఉద్దేశించి ప్రసంగించారు. అనంతపురం తపోవనం దగ్గర ఎమ్మెల్యే దగ్గుప్రసాద్ ఆధ్వర్యంలో ఒంటెలు, గుర్రాలు, గురవయ్యలతో స్వాగతం పలికారు. కాన్వాయ్‌పై పూలవర్షం కురిపించారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తాం మంత్రిని అయినా జిల్లాకు కూలీనే..! పయ్యావుల కేశవ్

ప్రజలు ఎంతో విశ్వాసంతో టిడిపి ప్రభుత్వానికి ఎన్నికల్లో అఖండ మెజార్టీని ఇచ్చి అధికారంలోకి కూర్చోబెట్టారని, వారి ఆకాంక్షల మేరకు రాష్ట్రంలో పాలన ఉంటుందని రాష్ట్ర ఆర్థిక శాఖ, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ తెలియజేశారు. రోడ్‌షో సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనపై నమ్మకంతో ఆర్థిక శాఖను అప్పగించారని తెలిపారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన శాఖ ద్వారా ప్రజలకు మేలు చేస్తానన్నారు. ఇంకా ఆర్థిక శాఖకు సంబంధించి ఖజానా పుస్తకాలు తెరవలేదని, గత ఐదేళ్లలో ఏమి జరిగిందో తెలుసుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్రానికి మంత్రిని అయినా అనంత జిల్లాకి తాను కూలీగానే పని చేస్తానని చెప్పారు. టిడిపి ప్రభుత్వం హయాంలో రాష్ట్రాన్ని అభివద్ధి పథంలో పరుగులు పెట్టిస్తామన్నారు. తాను ఆరాటాలు, పోరాటాల మధ్య పెరిగానన్నారు. రైతులు, కార్మికులు, ప్రజలందరి కష్టాలు తనకు తెలుసున్నారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో సాగు, తాగునీటి కోసం అనేక పోరాటాలు చేశానని తెలిపారు. భవిష్యత్తులో ప్రజలందరి ఆకాంక్షలను నెరవేరుస్తూ వారికి నచ్చే పాలనను కొనస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా నియోజకవర్గాల టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ, సర్పంచి పి.భరత్ కుమార్, ఎంపీటీసీలు ధనుంజయ, నారాయణస్వామి, నాయకులు ఎంకె.చౌదరి, ఎన్.కేశవ నాయుడు, రవితేజ నారాయణస్వామి, పి.రవితేజ, ఎన్.సూర్యప్రతాప్, దిల్కాశీనా, ఎస్.అబ్దుల్ జిలానీ, డాక్టర్ వి.నాగేంద్ర, ఎస్ఎం.బాషా, పి.సుధాకర్, చిన్న వెంకటస్వామి, పిల్లెల్లి కష్ణయ్య పాల్గొన్నారు.



అనంతపురంలో గజమాలతో కేశవ్‌కు స్వాగతం పలుకుతున్న టిడిపి అభిమానులు

గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం..!



నివాసాల మధ్య రోడ్డుపై పేరుకుపోయిన మురికి నీరు

రోడ్లపైకి చేరిన మురుగునీరు విజృంభిస్తున్న దోమలు రోగాల బారిన ప్రజలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల పరిధిలోని పలు గ్రామాల్లో మురుగునీటి కాలువల్లో చెత్తచెదారం పేరుకుపోయి రోడ్లపై మురుగు, వర్షం నీరు నిలిచి నీటి మడుగులను తలపిస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. బొమ్మనహాల్‌లోని వడ్డే క్యాంపులో డ్రెయినేజీ కాలువలు నిండి సీసీ రోడ్డుపై వర్షం నీరు నిలిచినా పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం వహించడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు బొమ్మనహాల్‌తో పాటు ఉద్దేహాల్, శ్రీధరగట్ట, గోవిందవాడ, దర్గాహొన్నూరు, బొల్లనగుడ్డం, కొలగాన హల్లి, ఏలంజి గ్రామాల్లో రోడ్లు బురదమయం అయ్యాయి. దీంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెంది గ్రామీణులు రోగాల బారిన పడుతున్నారు. ఉద్దేహాల్ గ్రామంలో తాగునీటి మోటార్లు కాలిపోయి వారం రోజులుగా తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నా పంచాయతీ కార్యదర్శి కనీసం ఫోన్ ఎత్తడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యం పనులతో పాటు దోమల నివారణ చర్యలు చేపట్టాలని, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఆయా విషయాలపై ఎంపిడిఒను వివరణ కోరగా ప్రస్తుతం నేను సెలవులో ఉన్నానని సమాధానం దాట వేశారు.

హెచ్ఎల్‌సి కాలువ పరిశీలన

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని హెచ్ఎల్‌సి కాలువ పలుచోట్ల కోతకు గురై గండ్లు పడ్డాయి. ఆయా ప్రదేశాలను, ప్రధాన కాలువను సోమవారం సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజశేఖర్ ఈఈ, కణేకల్ సెక్షన్ డివిజనల్ ఇంజినీర్‌తో కలిసి 119వ కిలోమీటర్ వద్ద కాలువను పరిశీలించారు. కాలువ గట్టు కోతకు గురవడాన్ని గమనించి మరమ్మతులకు అంచనాలను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఎస్ఈ తెలిపారు. వారితో పాటు హెచ్ఎల్‌సి సిబ్బంది ఉన్నారు.

ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు

ఏదైనా కిలో రూ.50పైమాటే.. - అదేబాటలోనే నిత్యావసర సరుకులు



ప్రజాశక్తి-పుట్లూరు

సహజంగా వేసవి రాగానే కూరగాయల ధరలు పెరుగుతాయి. వర్షాకాలం ప్రారంభం కాగానే ధరలు కాస్త తగ్గుతాయి. అయితే ఈసారి అందుకు భిన్నంగా వర్షాకాలం ప్రారంభం కాగానే కూరగాయల ధరలు అమాంతం పెరిగాయి. ఎండాకాలం ధరలు నామమాత్రంగా ఉన్నా.. వర్షాకాలం మొదట్లో ధరలు పెరగడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లిపాయల నుంచి కూరగాయల వరకూ అన్ని ధరలు పెరగడంతో సామాన్యుల పరిస్థితి దారుణంగా తయారైంది.

కొనలేని కూరగాయలు, ఉల్లిపాయలు

కూరగాయలు, ఉల్లిపాయలను చూస్తేనే ఏం కొనేటట్లు లేదు.. ఏం తినేటట్లు లేదు.. అంటూ సామాన్యులు లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం అన్ని కూరగాయల ధరలూ సుమారు కిలో రూ.80పైమాటే పలుకుతున్నాయి. 15 రోజుల వ్యవధిలోనే ఉల్లిపాయలు, టమాట సహా అన్ని కూరగాయల ధరలు దాదాపు 60 శాతం వరకు పెరిగాయి. డిమాండ్‌కు తగ్గట్టు ఉత్పత్తి లేకపోవడంతో ధరలు పెరుగుతున్నట్లుగా తెలుస్తుంది.

మే నెల మూడో వారంలో రూ.20 పలికిన కిలో ఉల్లిపాయల ధర ప్రస్తుతం రూ.50కి చేరింది. ఇదే బాటలోనే టమాటా ధర కూడా పయనిస్తోంది. ఇక క్యారెట్, వంకాయలు, బీన్స్, బీరకాయలతో పాటు ఆకుకూరల ధరలు కూడా అమాంతం పెరిగాయి.

శరాఘాతంగా ధరాఘాతం

ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలతోపాటు, కూరగాయల ధరలు సామాన్యులకు శరాఘాతంగా మారయని చెప్పవచ్చు. ధరలతో సామాన్యుడు ఏమి కొనాలన్నా జంకే పరిస్థితి నెలకొంది. అరకొర సంపాదనతో మార్కెట్‌కు వెళ్లాలంటే భయపడాల్సిన రోజులు వచ్చాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కొండెక్కి కూర్చున్న కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలను తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సామాన్యులు కోరుతున్నారు.



కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులతో కలెక్టర్ వినోద్‌కుమార్

కార్గిల్ విజయ్ దివస్ అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం

ఆర్మీ కల్నల్ మనోజ్‌కుమార్‌నాయర్ ఆధ్వర్యంలో కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకూ చేపట్టిన కార్గిల్ విజయ్‌దివస్ అవగాహన ర్యాలీ సోమవారం అనంతపురం చేరుకుంది. ఇందులో భాగంగా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ పి.తిమ్మప్ప ఆధ్వర్యంలో అనంతపురంలోని పిటిసిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్ కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులు కెప్టెన్ వట్నం ఉమామహేశ్వరరావు, సార్జెంట్ సంజీవకుమార్, సుబేదార్ మహమ్మద్ ఇర్షాద్, జూనియర్ వారెంట్ ఆఫీసర్ టి.కె.కృష్ణుడు ఘనంగా సత్కరించారు. అనంతరం కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు ఆర్‌ఎస్ నాగరాజ్, తిమ్మారెడ్డి, పెంచలయ్య, వై.ప్రసాద్, గొల్ల ఈశ్వరయ్య, బి.ఎ.హుస్సేన్, అల్లాబక్షు, సాయికుమార్, సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది గిరీష్, బాబా ఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్



ఉరవకొండలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

నార్పల : మండల కేంద్రంలో సోమవారం బక్రీద్ పండుగను ముస్లిములు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఖాజీ ఫయాజ్‌బాషా ఆధ్వర్యంలో స్థానిక జామియా మసీదు నుంచి ముస్లిములు కలిసి ఈద్గా మైదానం వరకూ ప్రదర్శనగా వెళ్లి నమాజ్ చేశారు. అనంతరం ఖాజీ బక్రీద్ ప్రాధాన్యతను వివరించారు. తర్వాత ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిములకు ముతవల్లి డిపో శంషాద్దీన్, మౌలానాలు జక్రియ, ఫారుక్, మన్సూర్, టిడిపి నాయకులు ఆకుల విజయ్‌కుమార్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



బొమ్మనహాల్‌లో

పెద్దపప్పూరు : మండల వ్యాప్తంగా ముస్లిములు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా జూటూరు, ముచ్చుకోట, వరదాయపల్లి, పెద్దయక్కులూరు, సివి.పల్లి తదితర గ్రామాల్లో ముస్లిములు ఉదయాన్నే మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

శింగనమల : త్యాగానికి ప్రత్యేకగా నిలిచిన బక్రీద్ పండుగను పురస్కరించుకుని సిఐ శ్రీధర్ ముస్లిములకు శుభాకాంక్షలు తెలిపారు. పండుగ జరుపుకుంటున్న ముస్లిములు, వివిధ ప్రాంతాల్లోని తన ఆత్మీయ ముస్లిం మిత్రులందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

బెలుగుప్ప : మండలంలోని గుండ్లపల్లి, శ్రీరంగపురం, కాలువపల్లి, హనుమరెడ్డిపల్లి, ఆవులెన్న, శీర్పి, ఎర్రగుడి తదితర గ్రామాల్లో ముస్లిం సోదరులు బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా ఉదయం ఈద్గాకు వెళ్లి ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగణం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.


వజ్రకరూరు : ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని విడపనకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు మండలాల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో ఘనంగా సోమవారం బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా ఉదయమే ఈద్గాకు చేరుకుని చేరుకుని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ బక్రీద్ అనేది త్యాగానికి సూచన అన్నారు. ఈ సమాజంలో ఒకరికొకరు అన్ని విషయాలలో త్యాగం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

రాయదుర్గం : బక్రీద్ సందర్భంగా పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న ఈద్గా మైదానంలో సోమవారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రభుత్వ ఖాజీ మహమ్మద్ సైఫుల్లా బక్రీద్ ప్రాముఖ్యత, హజ్రత్ ఇబ్రహీం అలైహిస్సలాం త్యాగాలను గుర్తు చేశారు. ప్రవక్త ముస్లింలకు ఇచ్చిన సందేశాన్ని వివరించారు. కార్యక్రమంలో పట్టణంలోని ముస్లింలు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొమ్మనహాల్, ఉద్దేహాల్, చంద్రగిరి, నేమకల్, ఉంతకల్, శ్రీధరగట్ట, గోనెహాల్, కల్లుహోల, గోవిందవాడ, దర్గాహొన్నూరు, తదితర గ్రామాల్లో ముస్లింలు ఉదయం 8 గంటలకే ఈద్గా మైదానాలు చేరుకుని నమాజ్ చేశారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.



బెలుగుప్పలో ఆలింగనం చేసుకుంటున్న ముస్లిములు



రాయదుర్గంలో

సిఎం రిలీఫ్ ఫండ్ కోసం వినతి

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని కోమటికుంట్లలో ఇటీవల విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన సీనియర్ నాయకుడు తిరుపతి నాయుడు కుటుంబానికి సిఎం రిలీఫ్ ఫండ్ అందేందుకు కృషి చేయాలని మండల టిడిపి నాయకులు కోరారు. ఈమేరకు అనంతపురంలోని స్వగృహంలో ఎమ్మెల్యే శ్రావణిశ్రీని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి చెందిన శ్రీనివాసులు నాయుడు సోదరుడు తిరుపతినాయుడు విద్యుదాఘాతంలో మృతిచెందిన విషయం తెలిసిందే అన్నారు. కావున సిఎం రిలీఫ్ ఫండ్‌ను మంజూరు చేయించి కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోమటికుంట్ల గ్రామానికి చెందిన కులశేఖర్‌రెడ్డి, రామచంద్రనాయుడు, ఎల్‌కె.చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శ్రావణిశ్రీతో మాట్లాడుతున్న కోమటికుంట్ల టిడిపి నాయకులు

రోడ్డుకు ఇరువైపులా కంపచెట్ల తొలగింపు



జెసిబి ద్వారా కంపచెట్లను తొలగిస్తున్న నాయకులు

పుట్లూరు : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు టిడిపి నాయకులు కోమటికుంట్ల బాబు సోమవారం మండలంలోని బాలాపురం నుంచి నారాయణరెడ్డిపల్లి వరకూ రోడ్డుకిరువైపులా పెరిగిన కంపచెట్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో పతకమూరి రామచంద్రనాయుడు, నారాయణరెడ్డిపల్లి రామమునిరెడ్డి, శ్రీనాథ్‌చౌదరి, చాలవేముల వాసు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో సోమవారం అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు రాధా సహకారంతో అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు చిరంజీవి నిర్విఘ్న, శిరీష్ వీర, సౌదామణి, సుబ్రమణ్యం, ఓబుళపతి, నల్లప్ప, జగన్నాథ్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

మంత్రి 'పయ్యావుల'కు గజమాలతో స్వాగతం



మంత్రిని గజమాలతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, నాయకులు

బుక్కరాయసముద్రం : ఆర్థికశాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి జిల్లాకు తొలిసారిగా వచ్చిన పయ్యావుల కేశవ్‌కు సోమవారం గార్లదిన్నె మండల పరిధిలోని కల్లూరు వద్ద ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ జడ్పీటిసి రామలింగారెడ్డి, పసుపుల హనుమంతురెడ్డి, కేశన్న, ఓబుళపతి, లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం చేయడం అభినందనీయం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

బక్రీద్ పండుగ సందర్భంగా ప్రతి ఏడాది స్వచ్ఛందంగా రక్తదానం నిర్వహించడం అభినందనీయమని నగర మేయర్ వసీం అన్నారు. సోమవారం ఈద్గా మైదానం వద్ద స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతపురం నగర ప్రజలు, ముస్లిం ప్రజానీకం 25 సంవత్సరాలుగా ప్రతి ఏటా బక్రీద్ పండుగ సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించడం ఆనవాయితీగా మారిందన్నారు. మానవతా నేతత్వంలో నజీర్ మిత్ర బందం నిర్వాహకులుగా మతసామరస్యం మన నినాదం రక్తదానం మన విధానం అంటూ రక్తదానాన్నే బలిదానంగా ఆచరించడం, బలిదానాలకు త్యాగనిరతికి, నిజాయితీకి ప్రతీక బక్రీద్ పండుగ అన్నారు. మానవతా కులమతాలకతీతం, రక్తదానంతో సమాజ ఐక్యతను చాటడం హర్షనీయం. అన్నారు. 81 మంది రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సిపి నాయకుడు అనంత చంద్రారెడ్డి, మానవత కన్వీనర్ తరమెల అమరనాథరెడ్డి, ఏకేఎస్ ఫయాజ్, మానవత కో-కన్వీనర్ సలీమ్ మాలిక్, అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ముస్లిం నాయకులు

నేరాలు ఘోరాలు

హత్య కేసు నిందితుడు అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

రాయదుర్గం : డి.హీరేహాల్ మండలంలోని మురడి గ్రామంలో ఆదివారం జరిగిన హత్య కేసులో నిందితుడిని 24 గంటల్లోపే అరెస్టు చేసినట్లు కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు తెలిపారు. రాయదుర్గం రూరల్ పోలీస్ సిఐ కార్యాలయంలో సోమవారం సాయంత్రం డీఎస్పీ విలేకరుల సమావేశంలో హత్య కేసు వివరాలు వెల్లడించారు. మురడి గ్రామానికి చెందిన హరిజన చిన్నబాబు అలియాస్ యేసురాజు ఆదివారం మధ్యాహ్నం గ్రామంలో చికెన్ షాపు నిర్వహిస్తున్న మురుడప్ప వద్దకు వచ్చి తనకు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని, అలాగే చికెన్ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇందుకు నిరాకరించడంతో యేసుబాబు బండరాయితో మురుడప్ప తలపై బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడిన మురుడప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. మురడప్ప పినతల్లి పెన్నక్క ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడు యేసురాజు డి.హీరేహాల్ మండలంలోని కల్లెం బస్టాప్ వద్ద వేచి ఉండగా ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, సిబ్బంది అతడిని అదుపులో తీసుకొని విచారించగా తానే మురుడప్పను హత్య చేసినట్లు అంగీకరించాడు. దీంతో చిన్నబాబు అలియాస్ యేసురాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో డీఎస్పీతో పాటు రాయదుర్గం రూరల్ సిఐ జె.ప్రసాద్‌బాబు, డి.హీరేహాల్ ఎస్ఐ ఎ.గురుప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మాంసం డబ్బుల కోసం ఘర్షణ

నలుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న బాధితులు

గుత్తి : మాంసం డబ్బులు విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడిన ఘటన మండలంలోని రజాపురం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రామ్‌గోపాల్ నాయుడు పొట్టేళ్ల మాంసం విక్రయించేవాడు. ఇందులో భాగంగానే అదేగ్రామానికి చెందిన యువరాజు, ధనలక్ష్మి అరువుగా మాంసాన్ని తీసుకెళ్లారు. మాంసానికి సంబంధించిన రూ.700 చెల్లించాలని ఇంటి వద్దకు వెళ్లి యువరాజును రామ్‌గోపాల్‌నాయుడు, దినేష్‌నాయుడు అడిగారు. ఈ నేపథ్యంలో ఇరు కుటుంబాల వారు వాదనకు దిగారు. మాటామాటా పెరిగి ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో యువరాజ్ సోదరులు వెంకీ, శీనా, కిట్ట, బాలరాజుతో కలిసి తమ కళ్లల్లో కారం చల్లి రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడినట్లు రామ్మోహన్ నాయుడు, దినేష్ నాయుడు వాపోయాడు. అలాగే మరోవర్గానికి చెందిన కృష్ణమనాయుడు, ధనలక్ష్మికి కూడా గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరు పిల్లలతో కలిసి గృహిణి అదృశ్యం

లేపాక్షి : మండల పరిధిలోని కంచిసముద్రం గ్రామానికి చెందిన కురుబ శ్రీనివాసులు భార్య సుధ తన ఇద్దరు కొడుకులతో కలిసి ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎవరికైనా వారి సమాచారం తెలిస్తే 90361 12685 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

బాలిక అనుమానాస్పద మృతి

ఓబుళదేవరచెరువు : మండల పరిధిలోని చౌడంపల్లికి చెందిన బాలిక అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. గ్రామానికి చెందిన ప్రమీల(16) తరచు ఫోన్ ఎక్కువగా మాట్లాడుతుండగా వారి తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఆమె ఆదివారం సాయంత్రం ఇంటినుంచి వెళ్లిపోయింది. బాలిక కుటుంబసభ్యులు ఎంతవెతికినా ఆచూకీ తెలియకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో గ్రామానికి సమీపంలోని చెక్‌డ్యాం వద్ద నీటిలో ప్రమీల మృతదేహం తేలియాడుతుండటాన్ని మంగళవారం ఉదయం గమనించిన స్థానికులు బాలిక కుటుంబసభ్యులకు సమాచారమందించారు. మృతురాలి తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు.

అనారోగ్యంతో టీడీపీ కార్యకర్త మృతి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవపురానికి చెందిన టీడీపీ కార్యకర్త గంజిగడ్ల చెన్నకేశవ (45) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, టీడీపీ పట్టణ అధ్యక్షులు పరిసేసుధాకర్, 24,25 వార్డుల టీడీపీ అధ్యక్షులు మాధవరెడ్డి, మాదవరెడ్డి తదితరులు చెన్నకేశవ భౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే గుమ్మనూరు తనయుడు ఈశ్వర్

ప్రజాశక్తి-పామిడి

మండలాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసే బాధ్యమ తమదే అని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు ఈశ్వర్ అన్నారు. ఎమ్మెల్యేగా గుమ్మనూరు జయరామ్ గెలుపొందిన తర్వాత మొట్టమొదటి సారిగా మండలానికి వచ్చిన ఆయన తనయుడు ఈశ్వర్‌కు మండల నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఇందులో భాగంగా ముందుగా ప్రజల అభ్యర్థన మేరకు తన సొంత నిధులతో వంకరాజు కాలవ పంచాయతీ పరిధిలో కంపచెట్లు తొలగించేందుకు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి పామిడి మండలం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుదన్నారు. ఇందులో భాగంగానే మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల ప్రధానదారులకు అడ్డంగా ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించే పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మండలాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. అనంతరం పట్టణంలోని కొత్త బస్టాండ్ దగ్గర 18వ వార్డుకు చెందిన టిడిపి నాయకుడు ఎర్రిస్వామికి చెందిన నూతన హైదరాబాద్ ఇరానీ చాయ్ కేఫ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జెసిబికి పూజలు చేసి కంపచెట్ల తొలగింపు పనులను పరిశీలిస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

స్కియాడ్‌కు నిధులు విడుదల చేయాలి

ఎస్సీ ఎస్టీ జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎస్సీ,ఎస్టీలు ఉద్యోగాల్లో ఎంపిక కావాలంటే వెంటనే స్కియాడ్‌కు నిధులు విడుదల చేసి ప్రారంభించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలో మూతపడిన స్కియాడ్ సెంటర్‌ను నిరుద్యోగులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా పోటీ పరీక్షలు, నైపుణ్యం శిక్షణ సదుపాయాలు కల్పించి ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపిన స్కియాడ్ ప్రస్తుతం అందకారంలో శిథిలావస్థకు చేరుకోవడం బాధాకరమన్నారు. కోట్ల రూపాయల భవనాలు మొండి గోడలుగా దర్శనమిస్తున్నాయని తెలిపారు. డీఎస్సీ, గ్రూప్ టూ ఉద్యోగ నియామక జాబితా ప్రభుత్వం విడుదల చేసిందని సంబరపడిన ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు సరైన శిక్షణ లేదని ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఎస్కేయూ విసి వెంటనే స్పందించి స్కియాడ్‌కు నిధులు విడుదల నిరుద్యోగ ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. పేదరికం, నిరుద్యోగంతో కొట్టమిట్టాడుతున్న దళిత, గిరిజన నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు పొందాలంటే స్కియాడ్‌ను తెరిచే విధంగా చర్యలు చేపట్టి మెటీరియల్ అందజేయాలన్నారు. గతంలో కూడా స్కియాడుకు నిధులు మంజూరు చేసి శిక్షణ సదుపాయాల కల్పించాలని పోరాటాలు చేశామని గుర్తు చేశారు. అదే బాటలో ఎస్కేయూ వైస్ ఛాన్సలర్‌ను త్వరలో కలిసి స్కియాడ్ తెరిచే వరకు పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు శివ, రాజశేఖర్, కుమార్, నరేష్, గోపాల్ జేఏసీ నాయకులు ధన తిమ్మప్ప, రామకష్ణ, ఓబులేసు, ఈశ్వరయ్య, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్సీ ఎస్టీ జెఎసి నాయకులు